క్లుప్తంగా

జగద్గురువు ఆదిశంకరులు

కాకినాడ రూరల్: జీవుడు, దేవుడు ఒకటేనని అద్వైత్వాన్ని ప్రబోధించడం ద్వారా ఆధ్యాత్మిక జ్ఞాన సంపదను అందించిన జగద్గురువు ఆది శంకరాచార్యులు అని ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ వేదుల శిరీష పేర్కొన్నారు. రమణయ్యపేటలోని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆదిశంకరుల జయంతిని నిర్వహించారు. సాక్షాత్తు పరమేశ్వరుడే ఆదిశంకరాచార్యుడిగా జన్మించారని, ఆ సేతు హిమాచలం పర్యటించి హిందూ ధర్మాన్ని పునరుద్ధంచడానికి కృషి చేశారన్నారు. వ్యాస విరచిత ప్రస్థాన త్రయమైన భగవద్గీతకు, ఉపనిషత్తులకు, బ్రహ్మ సూత్రాలకు భాష్యాలు రాశారన్నారు. హిందూ ధర్మంలోని వివిధ శాఖలలో ఉన్న చాందస భావాలు, మూఢ విశ్వాసాలను ఆయన తొలగించారన్నారు. 32 ఏళ్ల పాటు భూమిపై జీవించిన ఆది శంకరాచార్యులు భారతీయ తత్వ చింతనపై ఎన్ని తరాలైనా చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, శ్రీనివాసరావు, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోలీసు పికెట్

కాకినాడ రూరల్: కాకినాడ ఎస్.అచ్యుతాపురంలో ఇంద్రపాలెం పోలీసులు పికెట్ కొనసాగిస్తున్నారు. సరిహద్దు వివాదంలో దాడికి గురై చికిత్స పొందుతూ మృతి చెందిన కుక్కల నాని అంత్య క్రియలు శుక్రవారం జరిగాయి. నాని మృతదేహంతో కుటుంబ సభ్యులు గురువారం నిందితుడు పెంటి కృష్ణ ప్రసాద్(బాజి)పై చర్యలకు డిమాండ్ చేయడంతో పాటు అతడి ఇంటిని ధ్వంసం చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. మృతుడి బంధువుల ఆందోళన నేపథ్యంలో సీఐ చైతన్య కృష్ణ ఆధ్వర్యంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నాని అంత్యక్రియలు ప్రశాంతంగా ముగిశాయని, పికెట్ కొనసాగిస్తున్నట్టు ఇంద్రపాలెం అదనపు ఎస్సై సూర్య కుమార్ తెలియజేశారు.

ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు



జి.వేమవరంలో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలలో పాల్గొన్న మహిళలు

తాళ్లరేవు: జి.వేమవరం గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గాదేవి అమ్మవారి ఆలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల ఒకటిన ప్రారంభమైన ఈ ఉత్సవాలు శనివారం వరకు జరుగుతాయి. ఈ ఉత్సవాలలో భాగంగా శుక్రవారం గోపూజ, దీక్షాహోమాలు, క్షీరాధివాసం, ధాన్యాధివాసం తదితర కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో జరిపించారు. శనివారం ఉదయం 10.08 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. అనంతరం అన్నదానం నిర్వహిస్తామని ధర్మకర్త యర్రంనీడి నాగేశ్వరరావు, గుడి స్థలదాత లెంక రామన్నపాత్రుడు దంపతులు తెలిపారు.

కొత్తపుంతలు తొక్కేదెప్పుడు?

- చిత్తడి మార్గాలతో అన్నదాతల అవస్థ
- పంట ఉత్పత్తుల రవాణాకు ఇబ్బంది
- గ్రావెల్ రోడ్డు వేయాలని కోరుతున్న వలసపాకల, వేములవాడ రైతులు



గోతులుపడిన వలసపాకల పుంతమార్గం



వలసపాకల, వేములవాడ రైతులు వినియోగించే పుంతమార్గం దుస్థితి

కరప: పుంతమార్గాలతో పంట పొలాలకు రాకపోకలు సాగించేందుకు, పంట ఉత్పత్తులు తెచ్చుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకులు ఇచ్చిన హామీ నీటిమూటలు కావడంతో వారికి అవస్థలు తప్పడం లేదు. రైతులను ఆదుకునేందుకు పంట, మురుగు కాలువలపై కల్వర్టులు నిర్మిస్తామని, పుంతమార్గాలు ఆధునీకరిస్తామని చెప్పే నాయకుల మాటలు ఆచరణకు నోచుకోవడంలేదు. మండల పరిధిలోని వలసపాకల, వేములవాడ, కరప గ్రామాలకు చెందిన రైతుల పంటపొలాలు సుమారు 600 ఎకరాలు వలసపాకల గ్రామానికి ఆనుకుని ఉంటాయి. వాటికి వెళ్లాలంటే కొంగోడు పైపు పేరుతో ఉండే పంటబోది ఓ మార్గం. రైతులు పంటపొలాలకు వెళ్లాలన్నా, కూలీలు పనులు వెళ్లాలన్నా ఇదే మార్గం. పంటదమ్ములు చేసేందుకు, పండించిన పంటను తెచ్చుకోవడానికి ట్రాక్టర్లు, రెండెడ్ల బండ్లు పుంత ద్వారానే వెళ్తుంటాయి. రైతులు, కూలీలు ప్రతిరోజు సైకిళ్లు, మోటారుసైకిళ్లపై రాకపోకలు సాగిస్తుంటారు. రబీ సమయంలో ఎండ వల్ల ఇబ్బంది ఉండదు కానీ, తొలకరిలో కొద్దిపాటి వర్షం వచ్చినా చిత్తడిగా మారుతుంది. మార్గంలో ఉండే రేగడిమట్టి నానిపోయి, గోతులు పడి రాకపోకలకు ఇబ్బందవుతోంది. ఎరువుల బస్తాలు పొలాలకు పట్టుకెళ్లాలంటే, కూలీలతో మోయించుకోవాల్సి వస్తోందని, దానికి అదనంగా ఖర్చుచేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గతంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా పుంత మార్గాలు ఆధునీకరించేవారని, ఇప్పుడు వారు పట్టించుకోవడం లేదని వలసపాకల, వేములవాడ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి నాయకులు స్పందించాలి

రైతు ప్రభుత్వమని చెప్పుకొనే కూటమి నేతలు కనీసం పుంత మార్గాలు కూడా వేయించలేరా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. నాయకులు, అధికారులు స్పందించి పుంతమార్గానికి మోక్షం కల్పించేందుకు నిధులు మంజూరుచేయించి, గ్రావెల్ రోడ్డు నిర్మించాలని రైతులు కోరుకుంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



పంట పొలాలకు వెళ్లి రావాలన్నా, పండించిన పంటను తెచ్చుకోవడానికి పుంతమార్గమే శరణ్యం. కొద్దిపాటి వర్షం వచ్చినా చిత్తడిగా మారి, రాకపోకలకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. పుంత మార్గాన్ని ఆధునీకరించి, గ్రావెల్ రోడ్డు వేయాలని ఎంతోకాలంగా కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం మారింది ఇప్పటికైనా ఈ పుంతకు మోక్షం కలుగుతుందనుకుంటున్నాం.

వాసంశెట్టి అంజనేయులు, కౌలు రైతు, వలసపాకల

గ్రావెల్ రోడ్డు వేయాలి



రెండు గ్రామాల రైతులు ఎంతోకాలం నుంచి పుంతదారి నుంచే వెళ్లి వస్తున్నారు. రబీలో కంటే తొలకరి సీజన్ వచ్చిందంటే వర్షాకాలంలో పొలాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. రైతుల అవస్థలు గమనించి గ్రావెల్ రోడ్డు వేయించేందుకు చర్యలు తీసుకోవాలి. గతంలో పుంతరోడ్డు వేస్తామంటే రూ.లక్ష వరకు ఖర్చు పెట్టాం. ఇప్పుడైనా నాయకులు స్పందించి పుంతమార్గాన్ని ఆధునీకరించేందుకు చర్యలు తీసుకోవాలి.

వాసంశెట్టి రాముడు, రైతు, వలసపాకల.

సీహెచ్ఓల సమస్యలు పరిష్కరించాలి

బోట్‌క్లబ్: నేషనల్ హెల్త్ మిషన్‌లో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న సీహెచ్ఓల సమ్మెలకు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్ సంపూర్ణ మద్దతు తెలిపారు. స్థానిక కలెక్టరేట్ వద్ద చేస్తున్న ఐదోరోజు దీక్షకు శుక్రవారం మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారి సంఘాల ప్రతినిధులతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న సీహెచ్ఓలపై (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు) వివక్ష చూపుతోందన్నారు. గత 15 ఏళ్లుగా అమలైన విధానానికి ఈ ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు. దీనివల్ల అన్ని క్యాడర్ల ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం హ్యూమన్ రిసోర్స్ పాలసీ అమలు చేయాలన్నారు. హెచ్ఆర్ పాలసీ, ఇన్సెంటివ్ బకాయిలు చెల్లింపు తదితర డిమాండ్ల పరిష్కారం కోరుతూ చేస్తున్న సమ్మెకు ప్రభుత్వం స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ఏడుగురికి రెండు రోజులు చొప్పున జైలు, 11 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. శుక్రవారం కోర్టులో 18 మందిని హాజరుపర్చగా పై విధంగా జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

- ఏఐసీటీయూ రాష్ట్ర కన్వీనర్ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీటీయూ రాష్ట్ర కన్వీనర్ గొడుగు సత్యనారాయణ

బోట్‌క్లబ్: నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు కోరుతూ ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐసీటీయూ (ఆల్ ఇండియా సెంట్రల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్) రాష్ట్ర కన్వీనర్ గొడుగు సత్యనారాయణ అన్నారు. కేంద్ర కార్మిక సంఘాల సన్నాహక సమావేశం స్థానిక కచేరిపేటలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం కరోనా సమయంలో చర్చ లేకుండా తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు అమలుకు చేస్తున్న తీవ్ర ప్రయత్నాలను అడ్డుకునేందుకు దేశంలోని యావత్ కార్మిక వర్గం ఈ నెల 20 సమ్మె చేయడం ద్వారా అడ్డుకోవాలన్నారు. 13 కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే ఈ సమ్మె ఏ రంగంలో పనిచేసే కార్మికులకైనా కనీసం వేతనం ధరలకు అనుగుణంగా రూ.26 వేలు చెల్లించాలన్నారు. చట్టాలు బలంగా ఉన్నప్పుడే కార్మికులు న్యాయం జరగలేదన్నారు. ఇప్పుడు 44 కార్మిక చట్టాలు రద్దు చేస్తే తర్వాత భారతీయ కార్మికులు బానిసల కంటే దారణమైన పరిస్థితిల్లోకి నెట్టబడతారన్నారు. రాజ్యాంగ బద్ధంగా పోరాడే కార్మికులపై క్రిమినల్ చర్యలు తీసుకునేలా చట్టాలను మార్చడం కార్పొరేట్ పెట్టుబడిదారుల లాబ్ధి కోసమేనన్నారు.

వనదుర్గకు ఘనంగా చండీ హోమం



చండీ హోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి వనదేవతగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ఘనంగా చండీ హోమం నిర్వహించారు. సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, కొండదిగువన తొలి పావంచా వద్ద ఉన్న కనకదుర్గ అమ్మవారికి పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం చండీ హోమం అనంతరం హోమగుండంలో పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవార్లకు వేద పండితులు వేదాశీస్సులు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. వేద పండితులు వేదుల సూర్యనారాయణ, సంతోష్ ఘనాపాఠీ, వనదుర్గ ఆలయ అర్చకులు కోట వంశీ, పరిచారకుడు వేణు, వ్రత పురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. హోమంలో 30 మంది భక్తులు పాల్గొన్నారు. సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో, కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం హరగోపాల్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు.

రేపటి నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



ఎస్.అన్నవరంలోని ప్రసన్న వేంకటేశ్వర ఆలయం

తుని రూరల్: ఎస్.అన్నవరంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 4 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించేందుకు ఆలయ ధర్మకర్తలు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నిత్యపూజలు, పర్వదినాల్లో ప్ర త్యేక పూజలు నిర్వహించనున్నట్టు వారు తెలిపారు. 4న 108 కలశాలతో శోభాయాత్ర, 5న పుణ్యాహావచనం, 6న అగ్ని ప్రతిష్ఠ, గరుడ హోమం, 7న ఉదయం సామూహిక శ్రీలక్ష్మీనారాయణ వ్రతం, చంద్రప్రభ వాహన సేవ, 8న ధన్వంతరీ హోమం, సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం, 9న శ్రీకృష్ణ గోపికా పూజ, అశ్వవాహన సేవ, శ్రీకృష్ణ తులాభారం, 10న సుదర్శన హోమం, గజ వాహన సేవ, సహస్ర దీపాలంకరణ సేవ, తెప్పోత్సవం, 11న స్వాతి నక్షత్రం, నృసింహ జయంతి సందర్భంగా శ్రీలక్ష్మీనారసింహ హోమం, గరుడ వాహన సేవ, తిరువీధి పల్లకీ సేవ, 12న మహా పూర్ణాహుతి, వసంతోత్సవం, శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం, శ్రీపుష్పయాగం, మహాదశీర్వచనం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కిశోరి వికాసం శిక్షణను సద్వినియోగం చేసుకోండి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి తదితరులు

కాకినాడ రూరల్: కిశోరి వికాసం వేసవి శిక్షణ తరగతులను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ వై.లక్ష్మి కోరారు. సర్పవరం జంక్షన్ వద్ద రూరల్ మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం మండల స్థాయిలో కిశోరి వికాసం శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణలో పలు అంశాలతో కూడిన బుక్‌లెట్లను ఆమె ఆవిష్కరించారు. 11 నుంచి 18 ఏళ్ల బాలికలందరినీ గ్రూపులు వారిగా గ్రామ స్థాయిలో ఏర్పాటు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. శిక్షణలో బాలికలు విద్య, ఆరోగ్యం, పోషణ, రుతు క్రమం, పరిశుభ్రత, బాలికల హక్కులు, సదుపాయాలు, విద్యా నైపుణ్యాల అభివృద్ధికి అమలుతో ఉన్న ప్రభుత్వ పథకాలు, పోక్సో చట్టం, బాల్య వివాహాల నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఎంఈఓ ఏసుదాసు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మార్తమ్మ, సింహచలం, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ ఉపయుక్తం



కార్యక్రమంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవి చక్రవర్తి

బోట్‌క్లబ్ : పదో తరగతిలో ప్రవేశించే విద్యార్థులు వేసవిలో నిర్వహించే అవగాహన తరగతులు సద్వినియోగం చేసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రవి చక్రవర్తి అన్నారు. యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో 30 రోజుల పాటు నిర్వహించే అవగాహన తరగతులను శుక్రవారం స్థానిక కచేరీపేట యూటీఎఫ్ హోంలో ప్రారంభించారు. పదో తరగతిలోకి ప్రవేశించే విద్యార్థులకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. తరగతులు ఉదయం 8 నుంచి 10.30 వరకూ జరుగుతాయన్నారు. యూటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర వర్మ మాట్లాడుతూ వివిధ సబ్జెక్టుల్లో నిపుణులైన ఉపాధ్యాయులు ఈ తరగతులను బోధిస్తారని తెలిపారు. నగర పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ నగేష్, జిల్లా కార్యదర్శులు ఐ.ప్రసాదరావు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యకర సమాజం



నూతన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న సచ్చిదానంద యోగి

బోట్‌క్లబ్: ప్రాచీన కాలం నుంచి భారతీయ సంప్రదాయంగా వస్తున్న యోగా ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని సాధించవచ్చునని ఆదిగురు యోగా పీఠం స్వామి ఆదిగురు సచ్చిదానంద యోగి అన్నారు. ఆదిగురు యోగా ట్రస్టు పీఠం నూతన కార్యవర్గ సమావేశం శుక్రవారం పీఠం కార్యాలయంలో జరిగింది. ప్రజలు ఆరోగ్యకరమైన జీవనవిధానం అవలంబించేందుకు యోగా ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు. యోగా పట్ల అవగాహన పెంచేందుకు యోగా పీఠాన్ని స్థాపించి కార్యవర్గం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

నూతన కార్యవర్గం

వ్యవస్థాపక అధ్యక్షుడు ఆదిగురు సచ్చిదానంద యోగి, ఉపాధ్యక్షుడు ఎం.లక్ష్మీనారాయణరావు, ప్రధాన కార్యదర్శి మంజీర, సహ కార్యదర్శిగా అపరాజిత, కోశాధికారిగా వీవీ నరసింహ మూర్తి, కార్యవర్గ సభ్యులుగా ఇందిర, లక్ష్మీకాంత్, ఎం.వీరబాబు, రాంబాబు, సీహెచ్ సంగమేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, కె.భాస్కర్‌లను ఎన్నుకున్నారు. అనంతరం సభ్యులను స్వామీజీ సత్కరించి జ్ఞాపికలు అందించారు.

కుర్రతాళ ధ్వనుల కోలాటం

- సేవే పరమావధిగా దుర్గాడ భక్త బృందం
- సాధారణ పిల్లల అసాధారణ ప్రతిభ
- అత్యధిక సభ్యులతో భజన సమాజం



ఆకట్టుకున్న ఉమరామలింగేశ్వర కోలాట భజన మండలి ప్రదర్శన





పిఠాపురం: వారంతా విద్యార్థులు. చదువు, ఆటపాటలు మినహా మరేతర వ్యాపకాలు లేని చిన్నారులు. కేవలం చదువుకు మాత్రమే పరిమితమైన పిల్లలు.. ఇప్పుడు సంస్కృతికీ ప్రాధాన్యమిస్తున్నారు. ఖాళీ సమయాల్లో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ఇతర పిల్లలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. పిఠాపురం, పరిసర ప్రాంతాలతో పాటు, వివిధ ప్రాంతాల్లోను ఏవిధమైన ఉత్సవాలు, ఆలయాల వార్షికోత్సవాలు, దేవుడి కల్యాణాలు జరుగుతున్నాయంటే, అక్కడ ఒకేరంగు దుస్తులు ధరించి కరతాళ ధ్వనులతో, భక్తిపాటలతో అలరించే పలువురు బాలబాలికలు కనిపిస్తుంటారు. వారే గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన ఉమరామలింగేశ్వర కోలాట భజన మండలి. పదేళ్ల బాలిక నుంచి 20 ఏళ్ల వరకున్న బాలికలు ఈ బృందంలో సభ్యులుగా చేరి, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కోలాట, భజన కార్యక్రమాల్లోను పాల్గొంటూ పలువురి మన్ననలు అందుకుంటున్నారు.

60 మందితో ఆరంభమై..

దుర్గాడ పేరు చెబితే ఆధ్యాత్మికతను పెట్టింది పేరు. ఇక్కడ వెలసిన రామలింగేశ్వరస్వామి వారి ఆలయం ఎంతో చరిత్ర ఉన్నది కావడంతో.. ఇక్కడకు దేశ విదేశాల నుంచి భక్తులు వస్తుంటారు. ఆలయంలో ఏటా జరిగే ఉత్సవాల్లో ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాల్లో కోలాటం ఆ గ్రామ పిల్లల్లో ఉత్సాహం నింపింది. వారి ఉత్సాహం చూసిన నిమ్మగడ్డ వెంకట శివరామకృష్ణ 2017లో 60 మందితో ఓ బృందం ఏర్పాటు చేసి, కోలాటంలో శిక్షణ ఇచ్చారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు దత్తు, ఆదిత్య సహకారంతో 60 మందితో ప్రారంభమైన ఈ బృందం ఇప్పుడు 300 మందితో కొనసాగుతోంది. ఇప్పటి వరకు 200కు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టులో అతి పెద్ద భజన సమాజంగా గుర్తింపు పొందింది. క్రియ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.

కోలాటమంటే ముందుంటారు



దుర్గాడతో పాటు, ఎక్కడ ఏ ఆలయాల్లో ఉత్సవాలు జరిగినా మా సంఘ సభ్యులు ముందుంటారు. వీరంతా చిన్నవారే అయినప్పటికీ భక్తితో కోలాటం నేర్చుకున్నారు. కోలాట కళాకారులు భజన బృందం తిరుమల తిరుపతి దేవస్థానాల్లో జరిగే ఉత్సవాలకు వెళ్లి అక్కడ కోలాటం, భజనలు చేస్తుంటాం.

– నిమ్మగడ్డ వెంకట శివరామకృష్ణ, రూపకర్త, ఉమరామలింగేశ్వర కోలాట భజన మండలి

ఆ ఆనందమే వేరు



భక్తితో దేవుడికి చేస్తున్న సేవ ద్వారా వచ్చే ఆనందమే వేరు. తొక్కుడు బిళ్ల ఆడుకునే మీరు ఏం చేస్తారనే వారు. ఇప్పుడు మేము చేస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు చూసి అందరూ మెచ్చుకుంటున్నారు. కోలాటం చేసేటప్పుడు ఎప్పుడు కష్టం అనిపించలేదు. ఎంత చేసినా ఇంకా చేయాలనిపిస్తుంది.

– వెత్సా లలిత, సభ్యురాలు, కోలాట బృందం

దేవుడిచ్చిన వరం



భగవంతుడి ముందు ఆటపాటలతో మా భక్తిని ప్రదర్శించడం దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాం. గుడికి వెళ్లడం వేరు, సేవకులుగా గుడికి వెళ్లడం వేరని మా నాట్యం, కళ ప్రారంభించాక తెలిసింది. దణ్ణం పెట్టుకుని, మొక్కుబడులు ఇచ్చేసి వచ్చేస్తే మన వరకే తృప్తి మిగులుతుంది. సేవ చేస్తే పది మందికీ తృప్తితో పాటు, మనకు ఎనలేని సంతృప్తి కలుగుతోంది.

– చెరుకూరి ఆదిత్య, అధ్యక్షులు, ఉమరామలింగేశ్వర కోలాట భజన మండలి

ఆనందంగా ఉంది



చదువుతో పాటు, దైవ సన్నిధిలో సేవ చేయడం ఆనందంగా ఉంది ఆలయ ఉత్సవాల్లో మేము భాగస్వాములు కావడం సంతృప్తికరంగా ఉంటుంది. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాం. చాలా మంది మా బృందంలో చేరడానికి ఉత్సాహం చూపుతున్నారు.

– నాగళ్ల తేజ, సభ్యురాలు, కోలాట భక్త బృందం

భీమకవికి ఆలయ నిర్మాణం

- 4న వేములవాడలో విగ్రహ ప్రతిష్ఠ



వేములవాడలో నిర్మించిన భీమకవి ఆలయం

కరప: మండలం వేములవాడలో తుల్యభాగ నదీతీరాన శివాలయానికి ఎదురుగా నిర్మించిన ఆలయంలో ఆదివారం ఉదయం 7.10 గంటలకు వేములవాడ భీమకవి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. 2023లో అప్పటి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.10 లక్షలు మంజూరు చేసినట్టు ఆలయ కమిటీ పేర్కొంది. గ్రామస్తులు, భక్తులు ఇచ్చిన విరాళాలతో ఆలయాన్ని నిర్మించి ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. వేములవాడ భీమకవి తమ గ్రామంలోనే జన్మించారని, అందుకే ఇక్కడ ఆలయాన్ని నిర్మించాలని ఎంతో కాలంగా అనుకుంటున్నామని, అది ఇప్పటికి నెరవేరుతోందన్నారు. రావులపాలెం మండలం రావులపాడు గ్రామ వాస్తవ్యులు శైవాగమ ప్రతిష్ఠాచార్య పూజ్యం విశ్వనాథ శివాచార్య, భైరవభొట్ల మాచరి బ్రహ్మాజీశర్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. శనివారం సాయంత్రం నుంచి ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం

తాళ్లరేవు: చిల్డ్రన్స్‌క్లబ్ తాళ్లరేవు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్‌క్యాంపు–2025 శుక్రవారం ప్రారంభమైంది. ఈ క్యాంపును ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్‌సాగర్, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుపూడి శివనారాయణ బెలూన్‌లను గాల్లోకి వదిలి ప్రారంభించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగులు, ప్రజా సంఘాల భవనాలలో పదిరోజులపాటు నిర్వహించే కార్యక్రమాలను ప్రతినిధి మల్లేశ్వరరావు వివరించారు. చిన్నారులకు పలు ఆటలు, పాటలతో పాటు విజ్ఞానానికి సంబంధించి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.